ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 18 | మార్చి | 2024
పేజీలు 7

## ఈయు అధ్యక్ష, కార్యదర్శులుగా బాబు, వెంకన్న



-డిప్యూటీ ప్రధాన కార్యదర్శులుగా అప్పారావు, రాఘవులు
-36 మందితో కార్యనిర్వహణ సమితి

2 లో

## ప్రభుత్వానికి దన్నుగా నిలిచిన

# ఆర్టీసీ కార్మికులు




-ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
-బకాయిపడ్డ డిఏ విడుదల చేయాలి.. ఫిట్‌మెంట్ పెంచాలి
-ఏఐటియుసి రాష్ట్ర నాయకులు వివిఎస్ బోస్

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్టీసీ కార్మికులు దన్నుగా నిలిచారని మూడు నెలల్లో 22 కోట్ల మందిని గమ్య స్థానాలకు చేర్చారని ఏఐటియుసి రాష్ట్ర నాయకులు వివిఎస్ బోస్ తెలిపారు. ప్రభుత్వానికి దన్నుగా నిలిచిన కార్మికుల పట్ల ఫిట్‌మెంట్, హెచ్ఆర్ఏ బకాయిపడ్డ డిఏ చెల్లింపులలో వివక్ష తగదని ఆయన అన్నారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలలో భాగంగా రెండవ రోజు ఆదివారం ఎస్. బాబు అధ్యక్షతన జరిగిన మహాసభలో బోస్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులను కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ అపాయింట్‌మెంట్ డేట్ ఫిక్స్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 30 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు కేవలం 21 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వడం శోచనీయమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్టీసీ కార్మికులకు ఫిట్‌మెంట్ ఇవ్వాలన్నారు. మహాలక్ష్మి పథకంలో

మిగతా 2లో..

## నేటి నుంచి పది పరీక్షలు

-జిల్లాలో 97 కేంద్రాల ఏర్పాటు
-హాజరు కానున్న 16,577 మంది విద్యార్థులు
-ఐదు నిమిషాల నిబంధన అమలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో పదవ తరగతి పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. 18 నుంచి 30 వరకు పదవ తరగతి పరీక్షలు జరగనుండగా జిల్లాలో 16,577 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీటి కోసం జిల్లా వ్యాప్తంగా 97 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరగనున్నాయి. ఫిజిక్స్, బయలాజికల్ సైన్స్ పరీక్షలు మాత్రం ఉదయం 11 గంటల వరకే జరగనున్నాయి. గతంలో నిమిషం నిబంధన అమలులో ఉండగా ఇప్పుడు దానిని ఐదు నిమిషాలకు పెంచారు. విద్యార్థులు పరీక్షా కేంద్రంలోకి ఉదయం 9.35 నిమిషాల లోపు

మిగతా 2లో..

## లోక్‌సభ ఎన్నికలను

# సజావుగా నిర్వహించాలి




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా సాధారణ లోక్‌సభ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు తమ వంతుగా సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. ఆదివారం జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా

మిగతా 2లో..

-అమలులోకి ఎన్నికల ప్రవర్తనా నియమావళి
-ఏప్రిల్ 18న నోటిఫికేషన్
-ఏప్రిల్ 15 వరకు ఓటు నమోదుకు అవకాశం
-సమావేశంలో
జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి గౌతమ్

## జిల్లాకు నాలుగు కార్పొరేషన్ పదవులు






**ప్రజాపక్షం/ ఖమ్మం:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయిన సందర్భంగా 37 కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమిస్తూ గెజిట్ విడుదల చేసింది. 37 మందిలో ఖమ్మంజిల్లాకు చెందిన నలుగురికి అవకాశం దక్కింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాయల నాగేశ్వరరావు, డిసిసిబి మాజీ ఛైర్మన్ మువ్వా విజయ్‌బాబు, హైదరాబాద్‌లో నివాసం ఉండే వైరాకు చెందిన నూతి శ్రీకాంత్, వైరాకు చెందిన నాయుడు సత్యనారాయణ ఛైర్మెన్ పదవి పొందిన వారిలో ఉన్నారు. డిసిసిబి ఛైర్మన్‌గా పని చేసిన మువ్వా విజయ్‌బాబు పెనుబల్లి మండలం లంకపల్లికి చెందిన వారు. తొలుత టిడిపి పార్టీలోను ఆ తర్వాత బిఆర్ఎస్‌లో ఉన్నారు. ఆ తర్వాత పొంగులేటితో పాటు బిఆర్ఎస్‌లో చేరి పొంగులేటికి విధేయునిగా పని చేస్తున్నారు. గత ఎన్నికల్లో ఇల్లందు నియోజకవర్గ ఇంచార్జిగా పని చేశారు. విజయ్‌బాబుకు తెలంగాణ రాష్ట్ర విద్య సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా నియమించబడ్డారు. రాయల నాగేశ్వరరావు ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వెంకటాపురం గ్రామంలో

-వైరాకే దక్కిన రెండు
-గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మన్‌గా రాయల
-టిఎస్ఈడబ్ల్యూఐడిసి ఛైర్మన్‌గా
మువ్వా విజయ్‌బాబు

జన్మించారు. ఉన్నత విద్యను అభ్యసించిన రాయల నాగేశ్వరరావు తొలుత వామపక్ష రాజకీయాల్లో ఉన్నారు. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరి వివాద రహితుడిగా పేరొందారు. పలుసార్లు అవకాశం వచ్చి చేజారిన పార్టీ నిర్ణయాన్ని శిరసావహించారు. ఆయనకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్‌గా నియమించబడ్డారు. వైరాకు చెందిన మల్లు భట్టి విక్రమార్క ప్రధాన అనుచరుడు నాయుడు సత్యనారాయణ కు తెలంగాణ చేతివృత్తుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ బాధ్యతలను అప్పగించారు. ఆది నుంచి సత్యనారాయణ భట్టి అనుచరునిగా పేరొందారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా

మిగతా 2లో..

### ప్రభుత్వానికి దన్నుగా నిలిచిన

# ఆర్టీసి కార్మికులు

**(మొదటిపేజీ తరువాయి)**

భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన తర్వాత కార్మికులకు పని భారం విపరీతంగా పెరిగిందని సిబ్బంది, బస్సుల సంఖ్యను పెంచకుండానే ప్రయాణికుల సంఖ్య రెండు రేట్లు పెరిగిందని ఇది కార్మికుల పట్ల శాపంగా మారి విధి నిర్వహణ ప్రాణ సంకటంగా మారిందన్నారు. ఓవర్ లోడ్‌తో పాటు సమయపాలన లోపించిందని ఏ బస్సు ఎప్పుడు గమ్య స్థానం చేరుతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏ రంగంలోనైనా పోరాడేది  కార్మికులకు అండగా నిలిచేది ఏఐటియుసి అనుబంధ సంఘాలేనని సింగరేణి, ఆర్టీసీ, బ్యాంకింగ్, బిఎస్ఎన్ఎల్ సహా ప్రభుత్వ రంగ సంస్థల్లో ఏఐటియుసి పోరాటాలు చారిత్రాత్మకమన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని కార్మిక చట్టాలను సవరించిందని ఆయన తెలిపారు. కార్మిక పోరాటాలకు తలొగ్గి చట్ట అమలును తాత్కాలికంగా వాయిదా వేసింది కానీ లేకపోతే భారతీయ న్యాయ సంహిత చట్టం డ్రైవర్ల పాలిట శాపంగా మారేదని, భవిష్యత్తులో ఏ డ్రైవర్ కూడా తన వృత్తిని కొనసాగించలేని పరిస్థితి ఏర్పడేదన్నారు. అధికారం కోల్పోయాక బిఆర్ఎస్‌కు కార్మికులు, కార్మిక చట్టాలు గుర్తుకు వస్తున్నాయని అంతకు ముందు కార్మిక సంఘాలంటేనే మండిపడ్డ నేతలకు ఇప్పుడు గుర్తుకు రావడం శోచనీయమన్నారు. మహాసభలలో 21 తీర్మానాలపై ప్రతినిధులు చర్చించి ఆమోదించారు. తీర్మానాల అమలుకు సంబంధించి తొలుత ప్రభుత్వం దృష్టికి తీసుకు రావాలని పరిష్కారం కాని పక్షంలో ఆందోళన బాట పట్టాలని తీర్మానించారు. రెండవ రోజు మహాసభలలో యూనియన్ సీనియర్ నాయకులు కె. పద్మాకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, ఏఐటియుసి నాయకులు నర్సింహాం, యూనియన్, ఏఐటియుసి నాయకులు ఈదురు వెంకన్న, పాటి అప్పారావు, తోట రామాంజనేయులు, జే. రాఘవులు, జిడి ప్రసాద్, తిమ్మినేని రామారావు, కె. భాస్కర్, పిల్లి రమేష్, వెంకటరెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి పది పరీక్షలు



**(మొదటిపేజీ తరువాయి)**

మాత్రమే అనుమతి ఇస్తారు. ఆ తర్వాత అనుమతించరు. విద్యార్థులకు ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో కంట్రోల్ రూమును ఏర్పాటు చేశారు. 24 గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, సిట్టింగ్ స్క్వాడ్ తో పాటు 1164 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. వీరితో పాటు ఐదు శాతం అదనపు సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచారు.

**పరీక్షలకు పటిష్ట నిఘా ...**

పదవ తరగతి పరీక్షలకు పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఈ. సోమశేఖర శర్మ తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఆరు పాఠశాలల్లో ప్రహరీ గోడలు పాక్షికంగా కూలడంతో అక్కడ అదనంగా సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రశ్నా పత్రాలను నాలుగు చక్రాల వాహనంలో మాత్రమే తరలించేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేయడమే కాకుండా సమీపంలోని జిరాక్స్ సెంటర్లను కూడా మూసి వేయిస్తామన్నారు. పరీక్షా కేంద్రాలలో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచడంతో పాటు తాగునీరు, ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలు ఉంటే 8331851510 నెంబరుకు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చునని తెలిపారు. 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

## ఈయు అధ్యక్ష, కార్యదర్శులుగా బాబు, వెంకన్న

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్. బాబు, ఈదురు వెంకన్న ఎన్నికయ్యారు. ఖమ్మం నగరంలోని టిఎన్‌జీవోస్ ఫంక్షన్ హాల్‌లో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర మహాసభలలో చివరి రోజు  నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కె. పద్మాకర్, అధ్యక్షులుగా ఎస్. బాబు, కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఎండి అహ్మద్ అలీ, ఉపాధ్యక్షులుగా ఎం. వెంకట్ గౌడ్ లు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఈదరు వెంకన్న, ఉప  ప్రధాన కార్యదర్శులుగా పాటి అప్పారావు , జే. రాఘవులు, ప్రచార కార్యదర్శిగా సి. శంకర్, కోశాధికారిగా జిడి ప్రసాద్ లు ఎన్నికయ్యారు. మొత్తం 36 మందితో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వహణ సమితిని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు బాబు, వెంకన్న లు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా నూతన కమిటీ పని చేస్తుందన్నారు. ఇప్పటికే ఎంప్లాయిస్ యూనియన్ పక్షాన కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని చర్చలు, సంప్రదింపులు జరుపుతామని పరిష్కారం కానప్పుడు పోరాటం తప్పదన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ అపాయింట్ మెంట్ డేట్ ప్రకటించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది డిఏలు బకాయి ఉందని వాటిని వీలైనంత త్వరలో చెల్లించాలని ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేస్తుందన్నారు.

**ముగిసిన మహాసభలు...**

రెండు రోజుల పాటు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగిన ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ మూడవ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. రాష్ట్ర నలు మూలల నుండి  ఎంప్లాయిస్ యూనియన్‌కు ప్రాతినిథ్యం వహిస్తూ 250 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో 95 డిపోలకు ప్రాతినిథ్యం వహిస్తూ ప్రతినిధులు పాల్గొనడం గమనార్హం. మహిళా కార్మికులు హెచ్చు సంఖ్యలో పాల్గొన్నారు. మహాసభలలో చర్చల్లోను మహిళా కార్మికులు పాల్గొని తమ సమస్యలను సంఘం దృష్టికి తీసుకు రావడంలోను, తీర్మానాల విషయంలోను ముందు వరుసలో నిలిచారు. విజయవంతంగా మహాసభలను నిర్వహించిన ఆహ్వాన సంఘానికి, ఏఐటియుసికి కార్మిక ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లాకు నాలుగు కార్పోరేషన్ పదవులు

**(మొదటిపేజీ తరువాయి)**

లేకున్నా కాంగ్రెస్ పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేశారు. వైరాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నూతి వెంకట స్వామి కుమారుడు నూతి శ్రీకాంత్ గౌడ్‌కు బిసి కార్పోరేషన్ ఛైర్మన్‌గా నియమించబడ్డారు. వీరి కుటుంబం వైరా మండలం లక్ష్మీపురం గ్రామంలో కాంగ్రెస్ రాజకీయాలకు అంకితమైన కుటుంబం. గతంలో అనేక మంది ఈ కుటుంబం నుంచి కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులు నిర్వహించారు. వారిలో వెంకటస్వామి కుమారుడు శ్రీకాంత్ విద్యార్థి దశ నుంచి కాంగ్రెస్ అనుబంధ ప్రజా సంఘాల్లో పని చేస్తూ వచ్చారు. యువజన కాంగ్రెస్ విద్యాదికుడైన శ్రీకాంత్ శక్తి అవార్డును అందుకున్నారు. మొత్తంగా జిల్లాకు నాలుగు కార్పోరేషన్‌లు దక్కడంతో కాంగ్రెస్‌లో మంచి జోష్ వచ్చింది. అయితే సీనియర్ కాంగ్రెస్ నాయకుల్లో  కొందరు కార్పోరేషన్ పదవిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న వారికి రాకపోవడం పట్ల వారి అనుచరులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

# లోక్‌సభ ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

**(మొదటిపేజీ తరువాయి)**

ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి గౌతమ్ పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి జిల్లాలో సాధారణ లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై మీడియా, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేసిందని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వస్తుందని తెలిపారు. ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 25 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని ఏప్రిల్ 26న నామినేషన్ల పరిశీలన, ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని తెలిపారు. మే 13న పోలింగ్, జూన్ నాలుగున లెక్కింపు నిర్వహణ ఉంటుందని తెలిపారు. ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గ పరిధిలో ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజక వర్గాలు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఓటరు జాబితా ప్రకారం 15 మార్చి నాటికి 16,23,814 లక్షల మంది ఓటర్లు, 886 మంది సర్వీస్ ఓటర్లు, 222 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇందులో 85 సంవత్సరాలకు పైబడిన వారు 10,318 మంది, దివ్యాంగులు 30,389 మంది ఉన్నట్లు తెలిపారు. వీరిలో కావాల్సిన వారికి ఫారం 12డి ద్వారా హోమ్ ఓటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ పేరు సరి చూసుకోవాలని, జాబితాలో పేరు లేని వారు ఏప్రిల్ 15 వరకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని ఆయన తెలిపారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 1083 లోకేషన్లలో 1896 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఓటరుకు రెండు కిలో మీటర్ల పరిధిలో పోలింగ్ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. బఫర్, రిజర్వు బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎన్నికల కమిషనర్ సాధారణ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన శనివారం నాటి నుండే జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచేవిధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, బెదిరింపులకు పాల్పడడం, తప్పుడు ప్రచారాలు చేయడం పై చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీలకు, నాయకులకు సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్ విండో సిస్టం సువిధ యాప్ ద్వారా అనుమతులు అందిస్తామని తెలిపారు. ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందని తెలిపారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీలు లేదన్నారు. రాజకీయ సమావేశాలు, ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాల్లో, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో నిర్వహించ రాదని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎన్‌సిసి, సర్వేలెన్స్ బృందాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, వీడియో సర్వేలెన్స్ బృందాలను, ఎంసిఎంసి కమిటీ, వ్యయ పర్యవేక్షణ తదితర కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమాలపై ఫిర్యాదులను ప్రజలు 1950 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా, సి విజిల్ యాప్ ద్వారా చేయవచ్చునని తెలిపారు. నూతన జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో 24 గంటలు ఫిర్యాదులు స్వీకరించేందుకు కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. సి విజిల్ యాప్‌లో లైవ్ వీడియో అప్‌లోడ్ చేసిన 100 నిమిషాల  గడువు లోపు అధికారులు క్షేత్రస్థాయిలో చేరుకుని ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ఫోటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో 24 గంటల వ్యవధిలో, బస్టాండ్, రైల్వే స్టేషన్, పెట్రోల్ బంక్ మొదలైన పబ్లిక్ స్థలాల్లో 48 గంటల వ్యవధిలో, అనుమతులు లేని ప్రైవేటు స్థలాల్లో 72 గంటల వ్యవధిలో పూర్తి స్థాయిలో తొలగిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో కరపత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ముద్రించే సమయంలో ప్రింట్ ప్రెస్ ఫోన్ నెంబరు, ఎవరు ప్రింట్ చేయమన్నారు, వారి ఫోన్ నెంబరు తప్పని సరిగా పేర్కొనాలని ఇట్టి అంశాన్ని అన్ని ప్రింటింగ్ ప్రెస్ యజమానులకు సమాచారం అందించామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే ప్రజా ప్రాతినిథ్య చట్టం 1951 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని వీటిని పరిగణలోకి తీసుకుని సజావుగా ఎన్నికల నిర్వహణ కు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

**అక్రమ నగదు, మద్యం సరఫరా జరగకుండా చర్యలు : సిపి**

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అక్రమ నగదు, మద్యం సరఫరా జరగకుండా కట్టు దిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని సిపి సునీల్ దత్ తెలిపారు. జిల్లాలో 12 ఎఫ్ఎస్‌టి, 15 ఎఫ్ఎస్‌టి, 27 ఎంసిసి బృందాలు, 141 సెక్టార్ అధికారులను నియమించినట్లు తెలిపారు. జిల్లాలో 2 ఇంటిగ్రేటెడ్ ఇంటర్ స్టేట్ బోర్డ్ చెక్ పోస్టులు, 10 ఇంటర్ స్టేట్ చెక్‌పోస్టులు, ఎనిమిది ఇంటర్ డిస్ట్రిక్ చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. 24 గంటల పాటు పటిష్ట నిఘా ఉంచామన్నారు. రూ. 50వేల నగదుకు ఆధారాలు వెంట ఉండాలన్నారు. పెట్రోల్ బంక్, జ్యూయలరీ, షాపింగ్ మాల్ నుండి ప్రతి రోజు నగదు తరలింపు, బ్యాంకు డిపాజిట్ వివరాలు, డబ్బు రవాణా చేసే ఏజెంట్ వివరాలు అందజేస్తే ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు. ఎన్నికల దృష్ట్యా ప్రజలు ఆధారాలు లేకుండా రూ. 50 వేలకు మించి నగదుతో ప్రయాణం చేయవద్దని సూచించారు. ప్రతి రోజు తనిఖీలలో జప్తు చేసిన సొమ్మును జిల్లాలో ఏర్పాటు చేసే గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామని ఆధారాలు సమర్పిస్తే గ్రీవెన్స్ కమిటీ నగదు విడుదల చేస్తుందన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో స్వేచ్ఛ, న్యాయబద్ధమైన ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, ట్రైనీ ఐపిఎస్ మౌనిక, జెడ్పి సిఈవో వినోద్, డిపిఆర్‌వో ఎంఏ గౌస్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, వివిధ పార్టీల ప్రతినిధులు,  పాత్రికేయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వీధి పోటని దారి అడ్డగింత





**-ప్రశ్నిస్తే దాడి**
**-పోలీసులకు ఫిర్యాదు**

**ప్రజాపక్షం/ బోనకల్ :** ఏఆర్ కానిస్టేబుల్ తన ఇంటికి వీధి పోటు ఉందని అనేక ఏళ్ల నుంచి నడిచే బాటను మూసివేసి ప్రహరీ గోడ నిర్మించడం ఇదేమిటని ప్రశ్నించిన వారిపై దాడి చేసి భయభ్రాంతులకు గురి చేసిన సంఘటన మండల పరిధిలోని మోటమర్రి గ్రామంలో జరిగింది. ఓ ప్రజాప్రతినిధి వద్ద గన్‌మెన్‌గా పనిచేస్తున్న బుర్రి రమేష్ వీధి పోటు పేరుతో 20 కుటుంబాలు నడిచే రహదారిని మూసివేశారు. గ్రామస్తులు లేదా ఆ దారి వెంట నడిచే వారు ఎవరైనా ప్రశ్నిస్తే నా దగ్గర తుపాకి ఉంది కాల్చి పారేస్తానంటూ బెదిరించేవాడు. బాధితులు పలుమార్లు మండలాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. రెండేళ్ల నుంచి పోలీస్ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఏమి జరిగిందో కానీ ఎవరు స్పందించ లేదు. గ్రామ పంచాయతీ కార్యదర్శి పలుమార్లు నోటీసు ఇచ్చి తొలగించాలని చెప్పినా పట్టించుకోలేదు. శనివారం తహసీల్దార్ పున్నం చందర్, ఆర్‌ఐ లక్ష్మణ్, ఈవోఆర్డి శాస్త్రి సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రహరీ గోడ తొలగించి దారి క్లియర్ చేయాలని సూచించారు. ఒక దశలో అధికారుల ముందే రమేష్ బెదిరింపులకు పాల్పడ్డాడు. ఓ కాంగ్రెస్ నాయకుని అండతో రమేష్ ఇలా రెచ్చిపోతున్నట్లు గ్రామస్తులు ఆరోపించారు. ఈ దశలో గుడిద వెంకమ్మ, మరీదు నాగేశ్వరరావు, మరీదు తిరుపతిరావు, మరీదు స్వామి, గుడిద నాగేశ్వరరావు లపై బుర్రి రమేష్, బుర్రి శ్రీను, బుర్రి సురేష్ తదితరులు దాడి చేశారు. మధ్యవర్తులు వారించిన వినకుండా దాడికి పాల్పడ్డారు. బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## రాయలకు పదవి పట్ల కాంగ్రెస్ సంబురాలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు కు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ గా నియమించినందుకు నేలకొండపల్లి లో కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం సంబురాలు నిర్వహించారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చల కూరి నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. స్వీట్లు పంపిణీ చేశారు. పెద్ద ఎత్తున టపాసులు కాల్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెన్నపూసల సీతారాములు, మైశా శంకర్, జెర్రిపోతుల అంజిని, గుండా బ్రహ్మం, సుదర్శన్, జెర్రిపోతుల సత్యనారాయణ, కడియాల నరేష్, గుడిపాటి ముక్కంటి, దోసపాటి శేఖర్, యడవల్లి నాగరాజు, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, గుండు మహేష్, గురునాధం, వడ్డె జగన్, పవన్, సూరేపల్లి రవి, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్ లు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళి.. ఫ్లెక్సీల తొలగింపు

**ప్రజాపక్షం/సుజాతనగర్:** దేశంలో పార్లమెంట్ ఎన్నికలు సంబంధించి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల నియమావళి ప్రకారం సుజాతనగర్ గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి బి. నరేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఫ్లెక్సీలు తొలగించారు. పంచాయతీ సిబ్బందితో కలిసి శిలాఫలకాలు, విగ్రహాలు, వివిధ పార్టీల దిమ్మలకు మాస్కులు వేశారు. గోడలపై వాల్ పోస్టర్లు తొలగించి, పెయింటింగ్స్ ను లేకుండా చేస్తున్నారు. ఎన్నికల కోడ్ నియమావళి ప్రకారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామని రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు.



# ఎన్నికలు సజావుగా జరిగేందుకు చెక్‌పోస్టులు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పాలేరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి యం. రాజేశ్వరి తెలిపారు. మండలంలోని పైనంపల్లి, నేలకొండపల్లి లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది కి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు...పార్లమెంట్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని నాయకన్ గూడెం, పైనంపల్లి, నేలకొండపల్లి లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలోనే అప్పలనరసింహాపురం లో అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. చెక్‌పోస్టుల వద్ద ప్రతీ వాహనం ను తనిఖీ చేయాలని సూచించారు. ప్రతీ పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అధికారులు అంతా సమన్వయంతో ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేలా సహకరించాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాల్సిందేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యం. యర్రయ్య, తహశీల్దార్ గౌరిశంకర్, మండల పంచాయతీ అధికారి శివ, మండల రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ ఆలస్యం మధుసూధన్‌రావు, పంచాయతీ రాజ్ ఏఈ ప్రసాద్, నేలకొండపల్లి పంచాయతీ కార్యదర్శి దేవేందర్, సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా

**-విస్తృత తనిఖీలు నిర్వహించాలి**
**-చెక్‌పోస్టును తనిఖీ చేసిన కలెక్టర్, సిపి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా చర్యలు చేపట్టి విస్తృత తనిఖీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. ఆదివారం పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి కలెక్టర్ విపి గౌతమ్ ఇల్లందు రోడ్డు ఎన్నెస్పి కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది విధులు, నిర్వహణ, ఎన్ని వాహనాలు తనిఖీ చేసింది అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని తెలిపారు. నగదు, మద్యం రవాణాను నియంత్రించాలన్నారు. సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని, వాహనాల తనిఖీకి సంబంధించి రిజిస్టర్లను నిర్వహించాలన్నారు. ప్రతి చెక్‌పోస్టులో వీడియోగ్రాఫీకి తగు చర్యలు తీసుకోవాలన్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ 24 గంటలు పటిష్ట నిఘా పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర ఏసిపి రమణమూర్తి, అర్బన్ తహసీల్దార్ సిహెచ్ స్వామి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును పరిశీలించిన శిక్షణ కలెక్టర్



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని పంచదార పరిశ్రమ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆదివారం శిక్షణ కలెక్టర్ మాయాంక్ అగర్వాల్ పరిశీలించారు. ప్రతి రోజు తనిఖీ చేసిన వాహనము తనిఖీ రికార్డు వాహనములో తీసుకుపోతున్న నగదు కు సరైన ఆధారాలు ఉంచుకోవాలని వాహనముల రాకపోకల వివరాలు తదితర సమాచారాన్ని తప్పనిసరిగా రికార్డులు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఎవరికి ఎలాంటి మినహాయింపు లేదని 50,000 దాటిన నగదును ఆధారాలు లేనిచో సీజ్ చేసి జిల్లా అధికారులకు పంపించి తదుపరి విచారణ చేసిన తర్వాత సరైన ఆధారాలు ఉంటే నగదు అప్పజెప్పడం జరుగుతుందని తహశీల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పులి సాంబశివుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



**ప్రజాపక్షం/కల్లూరు:** మార్చి 18వ తేదీ సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి దామోదర ప్రసాద్ తెలిపారు. మార్చి 30వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయని ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు జరుగుతాయని పేర్కొన్నారు. కల్లూరు లోని ఉన్నత పాఠశాలలో 176 మంది బాలికొన్నత పాఠశాలలో 145 మంది, గురుకుల కళాశాలలో 229 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్న కోరుకొండలో 142 మంది విద్యార్థిని విద్యార్థులు మొత్తం 692 మంది ప్రభుత్వ ప్రైవేటు విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. ముఖ్య పర్యవేక్షకులుగా నివేదిత రమణ జోజప్ప రామమూర్తి లు ఈ నాలుగు కేంద్రాలకు ముఖ్య పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారని ఎం ఈ ఓ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని జిరాక్స్ కేంద్రాలు పరీక్ష సమయాలలో మూసివేసి ఉంటాయని విద్యార్థులకు ఐదు నిమిషాలు సమయాన్ని అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ప్రశాంతంగా ఆహ్లాదకరమైన సి సి కెమెరాల పర్యవేక్షణలో ఈ పరీక్షలు జరుగుతాయని వివరించారు. పోలీస్, ఆశ, ఆరోగ్య కార్యకర్తలతో పాటు 80 మంది ఇన్విజిలేటర్లు పాల్గొంటారని వివరించారు.

# మంత్రులను కలిసిన రాయల







**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పోరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లను మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా నియమించినందుకు రాయల నాగేశ్వరరావు ఆదివారం హైదరాబాద్‌లో మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి లను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ఆది నాయకత్వానికి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ముఖ్యమంత్రి పిఆర్‌వో వేం నరేందర్‌రెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించినందుకు సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

## సిపిఎం సీనియర్ నాయకులు వీరస్వామికి నివాళి



**ప్రజాపక్షం/బోనకల్:** మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు కొంగర వీరస్వామి(92) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన సంస్మరణ సభను ముష్టికుంట్ల గ్రామంలో అదివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ కొంగర వెంకటనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంగర వీరస్వామి నీతి, నిజాయితీకి మారుపేరని కొనియాడారు. తుదిశ్వాస విడిచే వరకు ఎర్రజెండాతోనే కొనసాగి అమరుడయ్యారన్నారు. గ్రామంలోని ప్రజాసమస్యల పరిష్కారానికి జరిగే పోరాటంలో ఆయన కృషి మరువలేనిదన్నారు. కొంగర వీరస్వామి సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ కొంగర రామయ్య సోదరులని, ఆయన బాటలో నడిచి సోదరుడి అండగా నిలిచాడన్నారు. మృతునికి ఇద్దరు కుమారులు, ఐదుగురు కుమార్తెలున్నారు. వీరస్వామికి నివాళులర్పించిన వారిలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఎం నాయకులు కందికొండ శ్రీనివాసరావు, దొప్ప కొరివి, షేక్ నజీరు, కాంగ్రెస్ నాయకులు బోయినపల్లి వెంకటేశ్వర్లు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్, వారి కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ పిల్లలకు ఆట వస్తువులు అందజేత



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని తనికెళ్లలోగల నాలుగు అంగన్‌వాడీ సెంటర్లకు సంబందించి 70 మంది పిల్లలు కూర్చోవడానికి చాపలు , ఆటవస్తువులు , బెడ్‌షీట్స్ , గర్భిణీలు , బాలింతలు భోజనం చేసేందుకు ప్లేట్స్ ప్రభుత్వ ఉపాధ్యాయుడైన గడల భాస్కర్‌రావు సమకూర్చారు. ఈ సందర్భంగా భాస్కర్ రావు మాట్లాడుతు చిన్న పిల్లలకు ఆటవస్తువులతో ఆటలాడించి దాంతోపాటు చదువునేర్పితే వారు క్రమం తప్పకుండా అగన్‌వాడీ కేంద్రాలకు వస్తారని అన్నారు. తల్లి తండ్రులు తమ పిల్లలను రోజు ఇంటివద్ద ఆటలాడించడానికి సమయం దొరకదని చిన్నపిల్లలకు ఆటలంటే చాలా ఇష్టం ఉంటుందని కనుక అంగన్‌వాడీ కేంద్రం లోని ఆయాలు , టీచర్లు పిల్లలకు ఆటలు ఆడించడం వలన పిల్లలు కేంద్రానికి రామని మారం చేయరని అన్నారు. కేంద్రాలలో చాపలు , ఆటవస్తువులు , బెడ్‌షీట్స్ , భోజనం ప్లేట్లు లేక ఇబ్బంది పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని వెంటనే పిల్లలకు అన్ని సమకూర్చినట్లు తెలిపారు. ఏసిడిపిఓ ఉషారాణి మాట్లాడుతు పిల్లల అవసరాలను గుర్తించి వారికి తగిన ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నందున నిత్యం పిల్లలమధ్య ఉండటంతో వారి అవసరాలను గుర్తించి ఏర్పాటు చేసిన గడల భాస్కర్ రావుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి , తనికెళ్ల గ్రామశాఖ సిపిఐ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు , అంగన్‌వాడీ టీచర్లు పల్లని పిచ్చమ్మ , చల్లా ఝాన్సీరాణి , గడల కళావతి , మంచికంటి శివరంజని తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని తనికెళ్ల గ్రామానికి చెందిన చల్లా సీతారాములు ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు తొలగించారు. ఆదివారం బాదితుడు సీతారాములుకు తెలంగాణా సాయుధ పోరాట యోధుడు కుమారుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడు గడల భాస్కర్‌రావు గడల సీతారామయ్య మెమోరియల్ నుంచి రూ 5 వేలు నగదును బాదితుడు భార్య నర్సమ్మకు అందించారు. ఈసందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతు రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలుపోగొట్టుకున్న సీతారాములుకు కనీసం నివసించడానికి ఇల్లు కూడా లేకపోవడం దారుణం అని అన్నారు. ప్రభుత్వం అన్నివిధాల ఆదుకోవాలని అన్నారు. చిన్న గుడిసెలో నివసిస్తున్న వ్యక్తికి కాలుపోవడంతో ఆకుటుంబం రోడ్డున పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయ వెంట సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు , సిపిఐ జిల్లా నాయకులు పివిరావు , పిన్నం పుల్లయ్య, బాణోత్ రామయ్య, కవిడ వీరభద్రం , పెదమళ్ల రత్తమయ్య, పొట్లపల్లి నరసింహారావు , గడల నాగేశ్వరరావు , అంగన్‌వాడీ టీచర్ గడల కళావతి , ఆకుతోట శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే గేటు కాలినడక దారి ఇక లేనట్లేనా..?





**ప్రజాపక్షం/బోనకల్:** మండల కేంద్రంలోని పాత రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించడం వలన గత 12 ఏళ్లుగా ఖమ్మం బస్టాండ్ సెంటర్ నుండి పాత బస్టాండ్, పోలిస్‌స్టేషన్, డిసిసిబి బ్యాంక్, పలు వ్యాపార స్థలాలకు వెళ్లాలన్నా, పాత బస్టాండ్ సెంటర్‌లో నివాసం ఉంటున్న ప్రజలు ఖమ్మం బస్టాండ్ సెంటర్, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బ్యాంక్‌లకు, ఇతరత్ర వ్యాపార స్థలాలకు రావాలన్నా తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొత్తగా 3వ రైల్వే లైన్ రైల్వే అధికారులు పనులను ముమ్మరంగా జరుపుతున్నారు. పనులు పూర్తవ్వడంతో రైల్వే గేటు కాలినడక దారిని రైల్వే అధికారులు ప్రహరీ నిర్మించనున్నట్లు ఇప్పటికే మండల ప్రజలలో చర్చనీయాంశమైంది. దీంతో మండల ప్రజలకు కష్టాలు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత బస్టాండ్ సెంటర్ నుండి ఖమ్మం బస్టాండ్ సెంటర్‌కు రైల్వే ఫ్లైవర్ బ్రిడ్జి మీదుగా రావాలంటే సుమారు 4 కిలోమీటర్లు టూవీలర్ల ద్వారా రావాల్సిన పరిస్థితి ఎర్పడుతుంది. రైల్వే గేటు కాలినడక దారికి అడ్డుకట్టగా ప్రహరీ నిర్మిస్తే పాత బస్టాండ్ సెంటర్, రావినూతల నివాసితులు, అటువైపు వృద్ధులు, వయస్సు పైబడినవారు 4 కిలోమీటర్ల దూరం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా నడవాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొననుంది. బోనకల్ రైల్వే స్టేషన్‌లో 3వ లైన్ పరిశీలన భాగంగా సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరేష్‌కుమార్ జైన్‌కు స్థానికులు వినతి పత్రం అందజేసి తమ సమస్యలను పరిష్కరించాలని, తక్షణమే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని కోరారు.

**రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేయాలి...**

మండల కేంద్ర ప్రజలతో పాటు, పరిసర ప్రాంత ప్రజలు అండర్ బ్రిడ్జి నిర్మాణం లేకపోవడం ఎన్నో యేళ్లుగా తీవ్ర అవస్థలు పడుతున్నారు. పాత బస్టాండ్ ప్రాంతంలో నివసించే వృద్ధులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆటోలు, ఇతరత్ర రవాణా సౌకర్యం లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నేడు రైల్వే 3వ లైన్ నిర్మాణం వలన ప్రహరీ నిర్మించడంతో పూర్తిగా కాలినడక దారి మూతపడుతుంది. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వాలు దృష్టికి సమస్యను పరిష్కరించాలి.

## నేటి నుంచి పది పరీక్షలు ప్రారంభం



**ఖమ్మం రూరల్ మండలంలో**
**ఆరు పరీక్ష కేంద్రాలు, 1009మంది విద్యార్థులు**
**-కేంద్రాల వద్ద 144సెక్షన్, వైద్యశాఖ నుంచి ఏఎన్ఎమ్‌లు**
**- పరీక్షలు నిర్వహించనున్న సిబ్బందికి గుర్తింపుకార్డు తప్పనిసరి**

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఈనెల 18నుంచి ప్రారంభం కానున్న పదిపరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు సర్వసిద్ధం చేశారు. ఇందులో భాగంగా ఖమ్మం రూరల్‌మండలంలో 6పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో 1009మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వారిలో 452మంది బాలురు 557మంది బాలికలు ఉండగా..వీరి కోసం 118మంది ఇన్విజిలెటర్స్‌ను నియమించారు. సిట్టింగ్ స్క్వాడ్‌తో పాటు ఫ్లయింగ్ డ్ బృందం పర్యవేక్షణ చేయనుంది. ఇందులో ఎంఈఓ,తహశీల్దార్,ఎంపిడీఓ, పోలీస్ అధికారి ఉండనున్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో,చీఫ్ సూపరిండెంట్ రూమ్‌లో సీసీకెమెరాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేయడంతో పాటు విద్యార్థులకు అస్వస్థకు గురైతే వైద్యసేవలను అందించేందుకు ఏఎన్ఎమ్‌లను నియమించారు. పరీక్షల నేపథ్యంలో సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయనున్నారు. అంతేకాకుండా నివాస ప్రాంతాల మధ్యలో ఉన్న పరీక్షా కేంద్రాల వద్ద అదనపు భద్రతా ఏర్పాట్లు చేయనున్నారు. ప్రధానంగా పరీక్షలు నిర్వహించనున్న సిబ్బంది తప్పనసరిగా గుర్తింపు కార్డును కలిగి ఉండాలన్నారు.

**సీసీకెమెరాల ఎదుట పరీక్ష పత్రాలు...**

చీఫ్ సూపరిండెట్ రూమ్‌లోని సీసీ కెమెరాల పరిధిలోని పరీక్ష పత్రాల కవర్లను తెరవనున్నారు. పోలీస్ స్టేషన్లకు దూరంగా ఉన్న సీ సెంటర్ల నుంచి ప్రశ్నాపత్రాలను తరలించేందుకు పోలీస్ ఎస్కార్ట్‌తో ప్రత్యేక వాహనాలను కేటాయించారు. విద్యార్థులు,సిబ్బంది పరీక్ష కేంద్రం లోపలికి ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్ల అనుమతిలేదు. అదేవిధంగా ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురావడం నిషేధం. మండు వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రతి కేంద్రంలో తాగునీటి సౌకర్యం కల్పించారు. పరీక్ష కేంద్రాలలో ఫ్యాన్లు,లైట్లు ఏర్పాటు చేశారు.

**పరీక్షా కేంద్రాల వివరాలు..**

ఖమ్మం రూరల్ మండలంలో 6పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా.. గొల్లగూడెంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల లో గొ 200, ఏదులాపురంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో 186, జలగంగనగర్‌లోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలోలో 139,ఏదులాపురం పంచాయతీ పరిధిలోని కోత్తూరులో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 240,పెద్దతండాపంచాయతీలోని నాయుడుపేటలో గల కరుణ విద్యాభవన్‌లో 150,తల్లంపాడు జిల్లాపరిషత్ఉన్నతపాఠశాలలో 94మంది విద్యార్థులతో కలిపి 1009మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

**విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుడదు : శ్యాంసన్, ఎంఇఓ.**



విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లోనుకాకుండా పదిపరీక్షలు రాయాలి. అందుకోసం పరీక్ష కేంద్రాల వద్ద ప్రశాంత వాతవరణం కల్పించాము. పరీక్ష సమయానికి 45నిమిషాల ముందు నుంచే పరీక్షా కేంద్రములోకి అనుమతి.విద్యార్థులు తప్పనిసరి హాల్ టికెట్లు, ఎగ్జామ్‌ప్యాడ్, పెన్ను, పెన్సిల్, జామెట్రిబాక్స్ తెచ్చుకోవాలి.విద్యార్థులు చూచిరాతలకు పాల్పడిన,పరీక్షా కేంద్రాల సిబ్బంది అక్రమాలకు పాల్పపడిన చట్టప్రకారం చర్యలు ఉంటాయి.

## నేటి నుంచి పది పరీక్షలు



**- భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా 13008 మంది విద్యార్థులు, 73 సెంటర్లు**
**- ఐదు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు**
**- నిమిషం నిబంధన ఎత్తివేత**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఏడాదిపాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన 10వ తరగతి విద్యార్థులు నేటి నుండి పరీక్షలు రాయబోతున్నారు. 18 నుండి ప్రారంభమయ్యే పరీక్షలు ఏప్రిల్ 2వ తేది తో ముగుస్తాయి. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఎన్నిరకాల ఏర్పాట్లు చేయడంతో పాటు నిమిషం నిబంధనను ఎత్తివేసింది.

**పరీక్షలు రాయనున్న13008 మంది విద్యార్థులు...**

10వ తరగతి పరీక్షలను 13008 మంది విద్యార్థులు రాయబోతున్నారు. వీరిలో 12341 మంది రెగ్యూలర్ విద్యార్థులు కాగా, 667 మంది ప్రైవేటుగా పరీక్షలు రాస్తారు. రెగ్యూలర్ విద్యార్థుల కోసం 70 సెంటర్లు, ప్రైవేటు విద్యార్థుల కోసం కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలంలలో 03 సెంటర్ల నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గం. నుండి మధ్యాహ్నం 12.30 గం. వ కు పరీక్ష జరుగుతుంది. ముగ్గురు సభ్యులతో కూడిన ఐదు ఫ్లైయింగ్ స్కాడ్‌లు, సిఎస్‌సిలు 73 మంది, డిఓలు 73 మంది, సిట్టింగ్ స్కాడ్‌లు 73 మంది విధులు నిర్వహిస్తారు.

**నిమిషనం నిబంధన ఎత్తివేత...**

విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం నిమిషం నిబంధనను ఎత్తివేసింది. దీంతో విద్యార్థులతో పాటు పలువురిలో హర్షం వ్యక్తమవుతోంది. ఏడాదంటా కష్టపడి చదివి పరీక్షా కేంద్రానికి ఒక్క నిమిషం ఆలస్యమైతే వెనక్కు పంపించే వారు. మనస్థాపానికి గురై ఎందరో ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారు. దీనిని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం ఈ కఠినతరమైన నిబంధనను ఎత్తివేసింది. ఐదు నిమిషాల వరకు పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా వచ్చినప్పటికీ వారిని మనుమతించాలని ఆదేశాలు జారి చేసింది. దీంతో పలువురు ప్రభుత్వ తీరును స్వాగతిస్తున్నారు.

**పరీక్ష తేదీలు ఇవే...**

మార్చి18వ తేది ఫస్ట్ లాగ్వేజ్, 19న సెకండ్ లాంగ్వేజ్, 21న ఇంగ్లీష్, 23న లెక్కలు, 26న సైన్స్,1, 28న సైన్స్2, 30న సోషల్, (ఏప్రిల్ 1న మెయిన్ లాంగ్వేజ్ సంస్కృతం,అరబిక్ 1, 2న సంస్కృతం, అరబిక్ 2) పరీక్షలు ఉంటాయి.

## ఖమ్మం రూరల్‌లో.. పొంగులేటి ప్రసాద్‌రెడ్డి విస్తృత పర్యటన



**- బైక్‌పై తిరుగుతూ ఇళ్లకు వెళ్లి పలు కుటుంబాలకు ఓదార్పు**

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** రాష్ట్ర రెవిన్యూ,గృహనిర్మాణం,సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోదరుడు జిల్లా కాంగ్రెస్ నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి ఖమ్మం రూరల్ మండలంలో ఆదివారం విస్తృతస్థాయిలో పర్యటించారు. అందులో బాగంగా ఏదులాపురం పంచాయతీ పరిధిలోని సత్యనారాయణపురంలో మెట్ట సుదర్శన్ రెడ్డి,అనుముల రావనరసమ్మ ఇళ్లకు వెళ్లి వారి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఆ తర్వాత రెడ్డిపల్లిలో ఉప్పలకృష్ణ,అనుముల కౌసల్యను వారి నివాసాల వద్దకు వెళ్లి ఓదార్చారు. అక్కడి నుంచి ఎంవీ,పాలెం,కాచిరాజుగూడెం గ్రామాలకు చేరుకుని పలు కుటుంబాలను పరామర్శించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న కనకటి నారాయణరెడ్డిని పరామర్శించారు. అనంతరం కాచిరాజుగూడెం,కస్నాతండా,తనగంపాడు,గూడూరుపాడు గ్రామాల్లో పర్యటించారు.



**బైక్‌పై హుషారుగా...**

పొంగులేటి ప్రసాద్‌రెడ్డి పర్యటన బైక్‌పై హుషారుగా సాగింది. కాంగ్రెస్ కార్యకర్తలు,నాయకుల జేజేల నడుమ ప్రజల పలకరింపులతో కొనసాగింది. ప్రతి ఒక్కరిని ఆత్మీయంగా పకలరిస్తూ వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ ముందరకు సాగరు. నేరుగా కుటుంబాల వద్దకు వెళ్లి ఓదారుస్తూ కుటుంబ సభ్యులకు కొండంత ధైర్యాన్ని అందిస్తూ మేమున్నం అని భరోసాను కల్పించారు.ఎవరు అధైర్యపడవద్దని మంత్రి పొంగులేటి శీనన్న అండగా ఉంటారని అభయమిచ్చారు. అర్హులందరికీ సంక్షేమపథకాలు అందుతాయన్నారు. పొంగులేటి ప్రసాద్‌రెడ్డి స్వయంగా ఇంటికి వచ్చి కల్పించిన భరోసాపై ఆ కుటుంబాలు సంతోషాన్ని వ్యక్తం చేశాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, బండి జగదీష్,యువజన కాంగ్రెస్ నాయకులు తమ్మినేని నవీన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కళ్లెం వెంకట్‌రెడ్డి, గోళ్లపాడు మాజీ సర్పంచ్,కాంగ్రెస్ నాయకులు మద్ది వీరారెడ్డి, మాజీ సర్పంచులు గోనే భుజంగరెడ్డి, పల్లెర్ల పాండయ్య, నాయకులు తిప్పిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, రంజిత్, గోపి తదితరులు పాల్గొన్నారు.

## సుబ్బంపేట ఇసుక ర్యాంపు సిత్రాలు




**అధికారుల అండదండలతో అక్రమాలు**

**ప్రజాపక్షం/చర్ల :** మండల పరిధిలోని సుబ్బంపేట ఇసుక ర్యాంపులో అక్రమాలు చోటు చేసుకుంటున్న ప్రజలు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇసుక ర్యాంపు సొసైటీ నిబంధనలకు విరుద్ధంగా బినామీ కాంట్రాక్టర్లు తమ ఇష్టాను సారంగా వ్యవహరిస్తూ నేరుగా గోదావరి గర్భం నుండి ఇసుకను మిషన్ల ద్వారా తోడేస్తు టిప్పర్లు ద్వారా పెద్ద ఎత్తున తరలిస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. బినామీ కాంట్రాక్టర్ల అక్రమాలకు టిఎండిసి అధికారుల అండదండలు ఉన్నాయని తెలుస్తోంది. ఇసుక ర్యాంపు గిరిజన సొసైటీలు స్థానిక గిరిజన యువతకు ఉపాధి కల్పన ప్రధాన ఉద్దేశ్యంతో ఏర్పాటు చేశారు. యువతకు ఉపాధి కల్పిస్తూ ట్రాక్టర్ల ద్వారా గోదావరి నుండి డంపింగ్ యార్డుకు ఇసుకను తరలించి స్టాక్ పాయింట్ పెట్టాల్సి ఉంటుంది. కానీ అందుకు విరుద్ధంగా గోదావరిలోనే మిషన్లు పెట్టి టిప్పర్లు నింపుతూ రేయింబవళ్లు తేడా లేకుండా ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు. ఇసుక బినామీల కారణంగా ర్యాంపుల ఇసుక సొసైటీకి చెందిన యువతకు ఉపాధి లేకుండా పోతోంది. సుబ్బంపేట ఇసుక ర్యాంపుకు నిర్దేశించిన సరిహద్దులు, అక్షాంశ రేకాంశాలు బినామీ గుత్తేదారులు చెరిపేసి తన ఇష్టానుసారంగా ఎక్కడబడితే అక్కడ ఇసుకను తోడేస్తున్నారనే ఆరోపణలు పెద్ద ఎత్తున వెల్లువెత్తుతున్నాయి. సుబ్బంపేట ఇసుకర్యాంపు గిరిజన సొసైటీ టిఎస్ ఎండిసితో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఏ ఒక్క నిబంధన కూడా పాటించకుండా వ్యవహరించడం పట్ల సంబంధిత అధికారులు అండదండలు పుష్కలంగా ఉన్నాయనేది తేటతెల్లమవుతోందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, టిఎస్ ఎండిసి జిఎం, టిఎస్ ఎండిసి చైర్మన్‌లు స్పందించి సుబ్బంపేట ఇసుక ర్యాంపు అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## తునికాకు మోడెం కొట్టే పనులను వెంటనే చేపట్టాలి





**ప్రజాపక్షం/చర్ల :** తునికాకు మోడెం కొట్టే పనులను వెంటనే చేపట్టాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో పాలెం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సకాలంలో తునికాకు ప్రూనింగ్ పనులు చేపడితే నాణ్యమైన ఆకు లభ్యమవుతుందని, ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలు, దళితులకు తునికాకు రెండో పంటగా ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకుని అటవీ అధికారులు, గుత్తేదారులు సకాలంలో పనులు చేపట్టాలన్నారు. అరకొర పనులు చేస్తే ఆకు సేకరణ తగ్గుతుందని, వెంటనే మోడెం కొట్టే పనులు ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు అడ్డగర్ల తాతాజీ, ఆవుల వెంకట్రావు, నాగరాజు, నర్సింహారావు, నర్సమ్మ, పద్మ, మంగమ్మ, అనసూయ, ముత్తయ్య, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

## చేపల వేటలో మండల ప్రజలు



**ప్రజాపక్షం/కరకగూడెం:** వేసవి ఆపై చెరువులో నీరు అడుగంటడం తో ఇంకే ముంది తాటిగూడెం గ్రా మ పంచాయితీ పరిధిలో చేపల వేట ప్రారంభమైంది. మండల పరిధిలోని కరకగూడెం, వెంకటాపు రం, చిరుమల్ల, బట్టుపల్లి, కలవల నాగారం, వీరాపురం, మోతే, బర్లగూడెం, పద్మపురం, అనంతరం, చొప్పాలాతో పాటు పలు గ్రామాల నుండి వేటకు ప్రజలు భారీ వచ్చారు. అందులోని చేపలు జనానికి నోరులూరిస్తున్నాయి. అంతా కూడబలుక్కొని ఒక్కసారిగా ఆ చెరువలోకి వెళ్లి జలపుష్పాల వేట సాగించారు. కరకగూడెం మండలంలో గల తాటిగూడెం ఊర చెరువులో ఆదివారం సామూహిక చేపల వేట సాగింది. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజ లంతా ఒకేసారి చేపలు పట్టేందుకు రావడంతో అక్కడ మత్స్యజాతరను తలపించింది.

## అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పొదెం



**ప్రజాపక్షం/భద్రాచలం :** రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ భద్రాచలం మాజీ ఎంఎల్ఏ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పొదెం వీరయ్యను ప్రభుత్వం నియమించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి వచ్చేందుకు కృషి చేసిన వారిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తించి సముచిత స్థానం కల్పించారు. పార్లమెంట్ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కార్పోరేషన్ చైర్మన్ పదవులను భర్తీ చేయడం గమనార్హం. ఇదిలా ఉండగా 2018 ఎన్నికల్లో భద్రాచలం ఎంఎల్‌ఏగా పోటీ చేసిన పొదెం వీరయ్య బిఆర్ఎస్ అభ్యర్థి పై విజయం సాధించారు. 2023 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకున్నప్పటికీ పార్టీని నమ్ముకుని ఉన్నందుకు, ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా కాంగ్రెస్ జెండాను మోసినందుకు అధిష్టానం ఆయనను గుర్తించి సముచిత స్థానం కల్పించింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా ఇప్పటికే కొనసాగుతున్న ఆయన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కాంగ్రెస్ పార్టీని ఓతాటిపైకి తెచ్చేందుకు తీవ్రకృషి చేశారు. పొదెంకు అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి దక్కడంతో ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నేటి ప్రజావాణి రద్దు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఐడిఓసిలో నేడు జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా తెలిపారు. జిల్లా యంత్రాంగం లోక్‌సభ ఎన్నికల విధుల నిర్వహణలో నిమగ్నమై ఉన్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

## నేడు శ్రీరామ నవమిపై సమావేశం

**ప్రజాపక్షం/భద్రాచలం :** వచ్చే నెల 17న జరిగే శ్రీరామనవమి, 18న జరిగే మహాపట్టాభిషేకం మహోత్సవాలపై నేడు ఐడిఓసి సమావేశ మందిరంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా తెలిపారు. ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులతో పాటు దేవస్థానం అధికారులు సమగ్ర నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

# కమ్మ కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్రంలో కమ్మ కార్పోరేషన్ ఏర్పాటు చేసినందుకు కమ్మ మహాజన సంఘ నేతలు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం స్వర్ణభారతి కళ్యాణ మండపం వద్ద కమ్మ కార్పోరేషన్ ఏర్పాటును హర్షిస్తూ కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహంతో పాటు కమ్మ సంఘ నేతల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని కులాలతో పాటు కమ్మ కులంకు కార్పోరేషన్ ఏర్పాటు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందుకు కృషి చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు రేణకాచౌదరికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కమ్మ వారి వృత్తి వ్యవసాయం అయితే ప్రవృత్తి పిల్లల చదువు అని తెలిపారు. కమ్మ కులంలో పేదలు తమ పిల్లలను చదివించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని కమ్మ కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని 30 ఏళ్లుగా కోరుతున్నామన్నారు. ఇటీవల ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ డిమాండ్‌ను నెరవేర్చిందన్నారు. కమ్మ కార్పోరేషన్ ఏర్పాటు వల్ల పిల్లల చదువుకు ఎంతగానో తోడ్పాడుతుందన్నారు. అదేవిధంగా ప్రభుత్వం నియమించిన రాష్ట్ర కార్పోరేషన్ ఛైర్మన్ పదవుల్లో ముగ్గురు కమ్మ వారికి అవకాశం ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా నుండి మువ్వా విజయ్‌బాబు, రాయల నాగేశ్వరరావు తో పాటు మరో కమ్మ సోదరుడు మన్నె సతీష్‌కుమార్‌ను రాష్ట్ర కార్పోరేషన్ ఛైర్మన్‌గా నియమించారని వారికి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కమ్మ వారు అధికంగా ఉన్న ప్రాంతాల్లో జనరల్ స్థానాల్లో సీట్లు కేటాయించి రాజకీయంగా అవకాశాలు కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కమ్మ మహాజన ప్రధాన కార్యదర్శి గొడవర్తి నాగేశ్వరరావు, కోశాధికారి నల్లమోతు రఘు, సహాయ కార్యదర్శి మందటి నరేష్‌చౌదరి, కార్యవర్గ సభ్యులు ఊట్ల మురళి, నల్లమల రంజిత్, బండి మాధవరావు, నున్నా నవీన్, తాళ్లూరి సృజన్ కుమార్, నల్లమల ఆనంద్, చింతనిప్పు కృష్ణచైతన్య, నూకవరపు కోటేశ్వరరావు, గొడవర్తి శ్రీను, బొప్పన్న కృష్ణ, నల్లమల వేణు, నార్నే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షలకు ఆర్టీసి బస్సుల ఏర్పాటు



**ఖమ్మం రీజినల్ మేనేజర్ వెంకన్న**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పదవ తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవసరమైన రవాణా ఏర్పాట్లు చేయడం జరిగిందని ఖమ్మం రీజినల్ మేనేజర్ సిహెచ్ వెంకన్న ఆదివారం తెలిపారు. ఈనెల 18 నుంచి ఏప్రిల్ రెండు వరకు జరిగే పది పరీక్షలకు సంబంధించి ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. పరీక్షా సమయానికి ముందు గానే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా రవాణా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. దీనికి సంబంధించి ఖమ్మం రీజియన్ పరిధిలోని అన్ని డిపో మేనేజర్లకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ బస్‌పాస్ గల రూట్‌తో సంబంధం లేకుండా హాల్‌టికెట్ పై ఉన్న పరీక్షా కేంద్రానికి ఉచితంగా ప్రయాణం చేయవచ్చునని తెలిపారు. బస్‌పాస్ లేని విద్యార్థుల నుంచి సాధారణ ఛార్జీలు వసూలు చేయబడతాయని తెలిపారు. బస్‌పాస్‌లు గల విద్యార్థులు కాంబినేషన్ టికెట్ తీసుకుని ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కూడా పరీక్షా కేంద్రాలకు ప్రయాణించవచ్చునని ఆయన తెలిపారు. మహాలక్ష్మి పథకం నేపథ్యంలో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినిలకు బస్‌పాస్ లేకున్నా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చునని తెలిపారు. పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఆర్టీసి బస్సు రవాణా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని సురక్షితంగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఆర్‌ఎం వెంకన్న తెలిపారు. ఇతర వివరాలు, బస్సుల విచారణ కోసం ఖమ్మం 9959225958, మధిర 9959225961, సత్తుపల్లి 9959225962, భద్రాచలం 9959225960, కొత్తగూడెం 9959225959, మణుగూరు 9959225963, ఇల్లందు 9959225959 నెంబర్లను సంప్రదించాలని ఆర్‌ఎం తెలిపారు.

# అక్రమంగా విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలి

**విలేకరుల సమావేశంలో బాధితుడు శ్రీనివాసరావు**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తాతల, తండ్రుల నాటి నుంచి వారసత్వంగా వస్తున్న భూమిని అక్రమంగా విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఖమ్మం కార్పోరేషన్ 14వ డివిజన్ కొత్తగూడెంకు చెందిన సిద్ధి శ్రీనివాసరావు అధికారులను కోరారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఖమ్మం అర్బన్ మండలం కొత్తగూడెం గ్రామం ధంసలాపురం పరిధిలో తాత, తండ్రుల నాటి నుంచి వారసత్వంగా వస్తున్నటువంటి సర్వే నెం.230లో 7.28 ఎకరాల పట్టా భూమి పాసుపుస్తకంలోకి ఎక్కిందని తెలిపారు. సరిహద్దులు కలిగి తమ స్వాధీనంలో ఉన్న 33 కుంటల భూమి పాసుపుస్తకంలోకి ఎక్కలేదని శ్రీనివాసరావు తెలిపారు. అట్టి భూమిని కబ్జా చేసేందుకు మొర్రిమేకల వెంకటనారాయణ ప్రయత్నించారన్నారు. తప్పుడు ధృవపత్రాలతో అధికారులను తప్పుదోవ పట్టించి ఫోర్జరీ సంతకాలతో రిజిస్ట్రేషన్ చేయించాడని శ్రీనివాసరావు ఆరోపించాడు. ఇట్టి విషయంలో వారిపై కేసు నమోదైందని తెలిపారు. వారి నుంచి తనకు ప్రాణ హాని ఉందని, తమ వద్ద ఉన్న భూ పత్రాలను పరి



శీలించి అట్టి భూమిని సర్వే చేసి మాకు న్యాయం చేయాలని అధికారులను శ్రీనివాసరావు కోరారు.

# అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ 2024 డైరీని ఆవిష్కరించారు. ఆదివారం జిల్లా పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ యూనియన్ కార్యాలయం నందు జరిగిన డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి గెజిటెడ్ అధికారుల సంఘం (టిజివోస్) రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టిజీవో జిల్లా ప్రధాన కార్యదర్శి మోదుగు వేలాద్రి, అకౌంట్స్ ఆఫీసర్ జిల్లా అధ్యక్షులు జే. పుష్పరాజ్, టి. రామకృష్ణ, రాష్ట్ర బాధ్యులు వేల్పుల శ్రీనివాస్, వి. నవీన్, వై. సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏలూరి శ్రీనివాసరావు డైరీని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ అందరం సంఘటితంగా ఉండాలని అప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. సంఘాల విధి విధానాలు, సభ్యుల కర్తవ్యాలు, సంఘ ఆవశ్యకత గురించి వివరించారు. ఈ సందర్భంగా ఏలూరి శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో టిజీవోస్ అసోసియేట్ ప్రెసిడెంట్ వాసిరెడ్డి శ్రీనివాస్, కోశాధికారి శేష ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు తమ్మిశెట్టి శ్రీనివాస్, నాగులపాటి శంకర్, మౌనిక, భవానిదేవి, రాధాకృష్ణ, శంకరాచార్యులు, నాగరాజు, పుల్లారావు, విజయకుమారి, విజయలక్ష్మి , ప్రమీల, సతీష్, జాన్‌పాటిల్, జయప్రకాష్, యశోద పాల్గొన్నారు.

# ప్రజావాణి తాత్కాలికంగా రద్దు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి (గ్రీవెన్స్‌డే) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధుల్లో జిల్లా అధికారులు, సిబ్బంది నిమగ్నమైన నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రజావాణిని తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందన్నారు. ఇట్టి విషయాన్ని ప్రజలు గమనించాలని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

# సేవాలాల్ కప్ బహుమతి రూ.50వేలు అందజేత




**ప్రజాపక్షం/కారేపల్లి:** ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం రెండు జిల్లాల ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన సేవాలాల్ కప్‌ను మొదటి బహుమతిని రూ.50వేలు అందజేశారు. కప్‌ను కైవసం చేసుకున్న సింగరేణి మండలం గోరు బంజారా క్రికెట్ క్లబ్ సింగరేణి టీం యొక్క బహుమతిని గెలుచుకోవడం జరిగింది.

# పది పరీక్షలకు సమయానికి హాజరుకావాలి

**ప్రజాపక్షం/కారేపల్లి:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నేడు జరగబోయే పదో తరగతి పరీక్షలకు హాజరయ్యేందుకు వెళ్లే విద్యార్థిని, విద్యార్థులు నిర్ణయించిన సమయానికి ముందు 30 నిముషాలకి వెళ్లాలి. అలాగే ప్రశ్నాపత్రం తీసుకున్నాక మీకు ముందు వచ్చిన జవాబులను జాగ్రత్తగా వ్రాయండి. ఎవరు కంగారుపడకుండా పరీక్షలు బాగా వ్రాసి మొదటి స్థానంలో ఉత్తీర్ణత సాధించి కుటుంబం, మీకు విద్యాసంస్థల పేరు నిలబెట్టండి అని సింగరేణి మండలం మాజీ ఎంపిపి బానోతు దేవ్లానాయక్ పేర్కొన్నారు.



# తెలంగాణ బిసి కార్పొరేషన్ చైర్మన్‌గా నూతి శ్రీకాంత్







**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లా వైరాకి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు నూతి వెంకటస్వామి తనయుడు నూతి శ్రీకాంత్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ బిసి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడం పట్ల వైరాలోని కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి విధేయతగా ఉంటూ కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని ఉన్న కుటుంబం నుంచి వచ్చిన బిసి కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ యువ నాయకుడు. రాహుల్‌గాంధి జోడో యాత్రలో పాల్గొని అడుగులో అడుగేసి పాదయాత్రలో నడిచాడు. విద్యారంగం నుంచే కాంగ్రెస్ వాదిగా ఉన్న నూతి శ్రీకాంత్ 1982 ఏప్రిల్ 3న జన్మించాడు. విద్యాభ్యాసం ప్రారంభించిన శ్రీకాంత్ 1999 నుండి 2001 వరకు ఎన్ఎస్‌యుఐ ప్రెసిడెంట్‌గా, 2001 నుండి 2004 హైదరాబాద్ సిటి ఎన్ఎస్‌యుఐ జనరల్ సెక్రటరీగా, 2004 నుంచి 2006 ఎన్ఎస్‌యుఐ ఉమ్మడి రాష్ట్ర జనరల్ సెక్రటరీగా, 2006 నుండి 2007 వరకు చైర్మన్ ఆఫ్ మెంబర్‌షిప్ డవలప్‌మెంట్ డ్రైవ్ హైదరాబాద్‌గా, 2007 నుండి 2009 వరకు గ్రేటర్ హైదరాబాద్ ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడిగా, 2009 నుండి 2010 వరకు స్టేట్ కోఆర్డినేషన్ ఆఫ్‌గా, 2012 నుండి 2014 వరకు సికింద్రాబాద్ లోక్‌సభ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, 2014 నుండి 2018 వరకు ఓబిసి సెల్ అధ్యక్షుడిగా, హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా 2016 నుండి 2018 వరకు, 2021 నుండి ప్రస్తుతం వరకు ఓబిసి డిపార్ట్‌మెంట్ చైర్మన్‌గా శ్రీకాంత్ బాధ్యతను నిర్వహించారు. ఎంఏ పొలిటికల్ సైన్స్ చదివిన శ్రీకాంత్ తెలుగు, హిందీ, ఇంగ్లీస్, ఉర్దూ భాషల్లో దారుణంగా మాట్లాడగలుగుతాడు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రతి కార్యక్రమంలో తనకు ఇచ్చిన బాధ్యతలను ఒక స్ఫూర్తిగా తీసుకొని పార్టీ అభివృద్ధి కోసం చిన్నతనం నుండి ఎంతో కృషి చేశాడు. బిఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ వ్యతిరేకతపై ప్రజల సమస్యలపై జరిగిన ప్రతి ఉద్యమంలో శ్రీకాంత్ పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు తనను కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడం పట్ల ప్రతిఒక్కరికి నూతి శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్ర నాయకత్వం రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మల్లు భట్టివిక్రమార్క, ఉత్తమ కుమార్‌రెడ్డి, ప్రతి ఒక్క కాంగ్రెస్ అగ్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ తన మీద నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను పూర్తి చేసి ప్రజలకు ప్రభుత్వ ప్రజాపాలన అందించే విధంగా వారిలో భాగస్వామ్యమై ముందుకు సాగుతానని అన్నారు.

- -కాంగ్రెస్‌కు వీర విధేయులు నూతి శ్రీకాంత్ కుటుంబం
- -తండ్రి వెంకటస్వామి అడుగుజాడల్లోనే నూతి శ్రీకాంత్
- -రాహుల్ జోడో యాత్రలో అడుగులు వేసిన నూతి శ్రీకాంత్
- -ఎన్ఎస్‌యుఐ నుండి బిసి కార్పొరేషన్ చైర్మన్ వరకు
- -శ్రీకాంత్‌కు పలువురు శుభాకాంక్షలు

**నూతి శ్రీకాంత్‌కు పలువురు శుభాకాంక్షలు...**

వైరాకు చెందిన నూతి శ్రీకాంత్ తెలంగాణ బిసి కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకం పట్ల వైరా మండలంతో పాటు ఖమ్మం జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, యావత్ శ్రీకాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## హస్తకల కార్పొరేషన్ చైర్మన్‌గా సత్యనారాయణ ఎంపిక పట్ల హర్షం



**ప్రజాపక్షం/వైరా:** వైరాకు చెందిన నూతి సత్య నారాయణ కాంగ్రెస్ పార్టీకి వీర విధేయుడిగా ఉంటూ పార్టీలో తనకంటూ చెరగని ముద్ర వేసుకున్నాడు. ఆనాడు ఉమ్మడి రాష్ట్ర ముఖ్య మంత్రి స్వర్గీయ వైఎస్.రాజశేఖర్‌రెడ్డికి అత్యంత సన్నిహితులుగా ఉండేవాడు. అదేవిధంగా స్వర్గీయ జలగం వెంగళరావుతో నాయుడు సత్యనారాయణకు విడదీయని అనుబంధం ఉంది. అనంతరం జరిగిన రాజకీయ పరిణా మాల నేపద్యంలో కాంగ్రెస్ పార్టీకి సేవలను అందిస్తూ ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టీ విక్రమార్కకు అత్యంత సన్నిహితుడిగా నమ్మక స్తుడిగా నమ్మిన బంటుగా నాయుడు సత్యనారా యణ ఉన్నాడు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్ద ఎత్తున నియమించిన కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో వైరాకి ఎందిన నాయుడు సత్యనారాయణకు హస్తకళ కార్పొరేషన్ చైర్మ న్‌గా నియమించడంలో భట్టీవిక్రమ్మా కృషి ఉందని తెలుపుతున్నారు. ఎందుకంటే నమ్మిన వారికి అండగా ఉండి వారు ఎదుగుదలకు ప్రోత్స హించే నాయకత్వ లక్షణం భట్టీవిక్రమార్క వద్ద ఉందని ఆయన అనుచ రులు చెబుతున్నారు. హస్తకలల కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపికైన సత్య నారాయణ డిసిసి జనరల్ సెక్రటరీగా రాహుల్ గాంధి ప్రోటోకాల్ సెక్రటరీగా, స్టేట్ అడ్వర్టై జ్మెంట్ సెక్రటరీ, కాంగ్రెస్ పార్టీలో పనిచేశారు. ఆది నుండి నాయుడు సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీలో చురుకైన నాయకుడిగా పేరు తెచ్చుకున్నాడు. ఈ సందర్భంగా నాయుడు సత్యనారాయణ మాట్లాడుతూ తన మీద నమ్మకంతో తన పదవికి కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టీవిక్రమార్కకు కృతజ్ఞతలు తెలపడంతో పాటు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఇతర రాష్ట్ర మంత్రులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన మీద నమ్మకంతో ఇచ్చిన కార్పొరేషన్ చైర్మన్ అన్ని విధాల న్యాయం జరిగే విధంగా చూస్తానని తెలిపారు.

**నాయుడు సత్యనారాయణ ఎంపిక పట్ల హర్షం**

వైరాకి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాయుడు సత్యనారా యణ హస్తకల కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపిక కావడం పట్ల వైరాలోని వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలిపారు.

## కరెంటు షాక్‌తో గేదె మృతి

**ప్రజాపక్షం/వైరా:** వైరా వ్యవసాయ మార్కెట్ యార్డ్ సమీపంలో పామాయిల్ తోట ప్రక్కన గేదె మృతి చెందింది. వైరా మున్సిపాలిటీకి చెందిన దగ్గుల శ్రీనివాసరెడ్డి అనే రైతు గేదె అటు వైపు పోతుండగా కరెంటు షాక్ తగిలి చనిపోయింది. సుమారు రూ.1.20లక్షలు ఆస్తి నష్టం జరిగిందని శ్రీనివాసరెడ్డి తెలిపారు. విషయం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది అక్కడికి వెళ్లి పరిశీలించి కరెంటు తీగను సరిచేశారు. ఆ పొలం వైపు మనుషులు ఉండి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేది అని ప్రజలు తెలిపారు.



## బోడేపూడి వైద్యశిబిరం వరుసగా 105వ నెల విజయవంతం

### -తీవ్ర ఎండల నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/వైరా:** తీవ్ర ఎండల నేపద్యంలో వివిధ రకాల అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉన్న ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని బోడేపూడి కళానిలయం సంస్థ కార్యదర్శి బొంతు రాంబాబు, డాక్టర్ జట్ల రంగారావు అన్నారు. ప్రతి నెల మూడో ఆదివారం వైరా సిపిఎం కార్యా లయంలో జరిగే బోడేపూడి కళానిలయం వైద్యశిబిరం వరుసగా 105వ నెల విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి బొంతు రాంబాబు ప్రముఖ వైద్యులు జట్ల రంగారావు మాట్లాడుతూ అంతర్జాతీయ నిపుణులు ఈ వేసవిలో తీవ్రంగా వేడి గాలులు బలంగా ఉండే అవకాశం ఉంటుందని హెచ్చరికలు జారీ చేస్తున్న నేపద్యంలో షుగర్, బిసి, ఇతర అనా రోగ్య సమస్యలు ఉన్న ప్రజలు తగు జాగ్రత్తలతో ఉండాల్సిన అవసరం ఉందని, ఉదయం 10గంల తర్వాత ఎట్టి పరిస్థితుల్లో ఎండలోకి వెళ్లకుండా జాగ్రత్త పడాలని సూచించారు. తగి నన్ని మంచినీళ్ళు రోజువారి తీసుకోవాలని అన్నారు. అనారోగ్య సమస్యలు దీర్ఘకాలం వేధించే దాని కంటే ముందు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పిల్లల మర్రి సుబ్బారావు, సుంకర సుధాకర్, బొంతు సమత, మాదినేని రజిని, మాడపాటి సుజాత, గుడిమెట్ల మోహన్‌రావు, మల్లెంపాటి ప్రసాద్, పాసంగులపాటి చలపతిరావు, పుప్పాల నాగ రాజు, అనుమోలు రామారావు, కంభంపాటి సత్యనారాయణ, పూనాటి సూరయ్య, మాదినేని ఉదయ్, మందడపు నాగేశ్వరరావు, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.